www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 06 | జూలై | 2026 పేజీలు : 8

## రైతాంగ సమస్యలను పరిష్కరించాలి

-13న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయండి : సాబీర్ పాషా




సెంటర్ స్ప్రెడ్

# ఆగని అక్రమ రవాణా..!




పాల్వంచలో..

-అత్యంత లాభసాటి వ్యాపారంగా గంజాయి
-ప్రతి రోజు ఎక్కడో ఒక చోట పట్టుబడుతున్న గంజాయి
-వందల వాహనాలు సీజ్
-పల్లెలకు పాకుతున్న గంజాయి మత్తు

అక్రమమా, సక్రమమా అన్నది పక్కనపెట్టి ధనార్జనే ధ్యేయంగా కొందరు వ్యవహరిస్తున్నారు. వారు చేస్తున్న వ్యాపారం లక్షలాది మంది జీవితాలతో చెలగాటమాడుతుందని తెలిసినా అదే పద్ధతిని కొనసాగించడం శోచనీయం. లక్షల విలువైన వాహనాలు సీజ్ అవుతున్నా వివిధ సెక్షన్ల క్రింద బలమైన కేసులు నమోదవుతున్నా అక్రమ పద్ధతులను మాత్రం వదలడం లేదు. ప్రతి రోజు ఎక్కడో ఒక చోట గంజాయి రవాణా చేస్తూ పట్టుబడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. -ప్రజాపక్షం/ఖమ్మం

మెయిన్‌లో

## రైతుబంధు దుర్వినియోగంపై
# చర్యలు తప్పవు



-మంత్రి పొంగులేటి
సత్తుపల్లిలో రూ.2 కోట్ల అవుట్‌డోర్ స్టేడియానికి శంకుస్థాపన

ప్రజాపక్షం/సత్తుపల్లి: గత ప్రభుత్వ హయాంలో బోగస్ పట్టాదార్ పాస్‌బుక్కుల ఆధారంగా రైతు బంధు నిధులను అక్రమంగా పొందిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. ప్రతి గ్రామంలో సమగ్ర సర్వే నిర్వహించి, వాస్తవంగా భూమి సాగు చేస్తున్న రైతులకు మాత్రమే రైతుబంధు అందేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఆదివారం

మిగతా 2లో..

## వలస నాయకులతో..
# అసలు కాంగ్రెస్ లీడర్లు విలవిల..!



-మొన్న బిఆర్ఎస్‌లో.. నేడు కాంగ్రెస్‌లోనూ వారేనా..?
-కష్టపడ్డ కాంగ్రెస్ నాయకులకు విలువలు దక్కేదెన్నడో..?
-ఆవేదనలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు

ప్రజాపక్షం/జూలూరుపాడు : ఉమ్మడి ఖమ్మం జిల్లా నాడు, నేడు ఎప్పుడూ కాంగ్రెస్ కు కంచుకోటనే, నాయకుడు వున్నా, లేకున్నా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ధైర్యంగా నిలబడి కాంగ్రెస్ పార్టీని కాపాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పోటీచేసిన అభ్యర్థులను గెలిపించి పార్టీ సత్తా చాటుతున్నాము. అలాంటి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే, నిన్నటిదాగా బిఆర్ఎస్ లో అన్ని పదవులు, ప్రభుత్వ పథకాలు దక్కించుకొని పథకాలు, పొంది పబ్బం గడిపిన కొందరు జంపింగ్ జిలాని నాయకులు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బిఆర్ఎస్ పార్టీని కాదని కాంగ్రెస్ పార్టీలో చేరి, పదవులు, పనులు, సంపాదించుకొని పబ్బం గడుపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టకాలంలో నిలబడి పోరాడిన కాంగ్రెస్

మిగతా 2లో..

## రాజకీయ అండతోనే
# జాప్యం చేస్తున్నారా..?





-ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..?
- ఏళ్లు గడిచిన పూర్తి కానీ రోడ్డు పనులు

ప్రజాపక్షం/వైరా : ఓ సాధారణ గుత్తేదారు పనుల్లో జాప్యం చేస్తే వెంటనే తగు చర్యలు తీసుకునే ఇంజనీరింగ్ అధికారులు రాజకీయ అండ కలిగిన గుత్తేదారుల వైపు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. గుంటలు పడి ప్రయాణానికి ఇబ్బందులు ఎదురు కావడంతో పాటు పది రోజుల్లోనే పలు ప్రమాదాలు జరిగి కాళ్లు, చేతులు విరిగిపోతున్నా అధికార వ్యవస్థ స్పందించడం లేదంటే ఇంజనీరింగ్ అధికారులపైనా రాజకీయ ఒత్తిడి ఏ స్థాయిలో ఉందో అవగతమవుతుంది.

మిగతా 2లో..

# రాజకీయ అండతోనే జాప్యం చేస్తున్నారా..?





**(మొదటిపేజీ తరువాయి)**

ఎక్కడో మారుమూల గ్రామంలో రోడ్డు పనులు చేయడంలో జాప్యం జరిగిందనుకుంటే పొరపాటే. నియోజక వర్గ కేంద్రమైన వైరా నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు అనుసంధానం చేసే రోడ్డు విస్తరణ పనులు రెండేళ్లుగా సా...... గుతూనే ఉన్నాయి. ఈ పనులు చేపట్టిన గుత్తేదారు ఓ మాజీ ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుడు కావడం వల్లే అధికారులు స్థానిక అధికార పార్టీ నాయకులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వైరాలోని రింగ్ రోడ్డు నుంచి సోమవరం గ్రామ సమీపంలోని గ్రీన్ ఫీల్డ్ హైవే వరకు రెండేళ్ల క్రితం రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. నత్తను కాదు దానబ్బను తలపించే రీతిలో అత్యంత నెమ్మదిగా పనులు జరుగుతున్నాయి. రోడ్డును విస్తరణ పరిచే క్రమంలో భారీగా గుంటలు ఏర్పడ్డాయి. ఆ గుంటల్లో పడి ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా గాయపడుతున్నారు. ఇటీవల కాలంలో దేవరపల్లి నుంచి గ్రీన్ ఫీల్డ్ హైవేపై వచ్చిపోయే వాహనాలను వైరా వరికే అనుమతిస్తున్నారు. వైరా నుంచి భారీ వాహనాలు తిరిగి ఖమ్మం వైపు రావాలంటే ఈ రహదారిపైనే వెళ్లాల్సి వస్తుంది. దీనితో గడిచిన ఐదారు నెలలుగా మరింత ఇబ్బందికరంగా మారింది. ఇంత జాప్యం జరుగుతున్నా అధికారులు గుత్తేదారుని మార్చి వేరే వారికి ఇవ్వడం లేదా సత్వరం పనులు జరిగేవిధంగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఈ రహదారిన ప్రయాణిస్తున్నా వారు ప్రశ్నిస్తున్నారు. ఎంత మంది మరణిస్తే లేదా గాయపడితే అధికారులు స్పందిస్తారు లేదా గుత్తేదారు నిర్లక్ష్యం వీడతారో అర్థం కావడం లేదు. రోడ్డు విస్తరణ పనులు మరింత జాప్యం జరిగే అవకాశం ఉంటే తక్షణం ఆ గుంటలకైనా మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. లేని పక్షంలో ఈ రోడ్డు నిర్మాణంలో జాప్యాన్ని నిరసిస్తూ తక్షణ మరమ్మతుల కోసం రాజకీయ పార్టీలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.

## వలస నాయకులతో..

# అసలు కాంగ్రెస్ లీడర్లు విలవిల..!

**(మొదటిపేజీ తరువాయి)**

పార్టీ నాయకులకు గుర్తింపు దక్కకపోగా, అవమానాలు ఎదుర్కొంటున్నాము. అధికారం లేకపోయినా కష్టపడ్డ నేతలకు మొండి చెయ్యి..



### మంద బాబు...

బిఆర్ఎస్ పదేళ్లపాటు అధికారంలో కొందరి నాయకులు పెట్టిన అనేక ఇబ్బందులకు, ఒడిదొడుకులకు ఎదురొడ్డి నిలబడి పార్టీ కోసం కష్టపడ్డ నేతలను పక్కన పెట్టేస్తున్నారన్న వాదన కూడా సీనియర్ నాయకుల్లో లేకపోలేదు. పార్టీ అధికారం కోల్పోయినప్పటి నుండి ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామని, కార్యకర్తలను కాపాడుకోవడం కోసం కష్టపడ్డామని, ఎన్నో కేసులు సైతం ఎదురుకున్నామని కొందరు కాంగ్రెస్ మాజీ నేతలు వాపోతున్నారు. పారాచూట్ నేతల కోసం అసలు కాంగ్రెస్ నాయకులను బలి చేస్తున్నారని తాళ్లూరి అచ్చయ్య తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్టీని నిలబెట్టుకోవడం కోసం ఎవరితో అయితే ఇబ్బందులు పడ్డామో. అదే నేతలు వచ్చి పార్టీలో చేరి పదవులు పొంది చలామణి అవుతున్నారని సీనియర్ కాంగ్రెస్ నేత మంద బాబు ఆవేదన వ్యక్తం చేసారు.

### పార్టీ ఏదైనా పాలించేది వారేనా...

జూలూరుపాడు మండలంలో కొందరు నాయకులు, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరి, డబ్బు ఎర జూపి కార్యకర్తలను, నాయకులను వారి చుట్టూ తిప్పుకొని చక్రం తిప్పుతున్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్, ఏ పార్టీ అధికారంలో ఉన్న అదే నాయకులు పార్టీలో చేరి చక్రం తిప్పడంలో మర్మం ఏంటి? గెలిచిన ఎమ్మెల్యే లు సైతం వలస నాయకులకు పెత్తనం అప్పజెప్పడంలో మర్మమేంటి?? పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులకు, చేదు అనుభవం లభించడానికి గల కారణాలేంటి, పార్టీ ఏదైనా పాలించడానికి అదే నాయకులు కావాలా.? పోరాడి గెలిచిన చిన్నపాటి నాయకులు కార్యకర్తలు, తలవంచి చేతులు కట్టుకోవాల్సిన పరిస్థితి ఏంటి, ఏ పార్టీ అయినా పాలించే నాయకులు వాళ్లేనా దళిత, సామాజిక వర్గాలకు న్యాయం జరగడం కష్టమేనా? ఇది మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తాళ్లూరి అచ్చయ్య ఆవేదన.

# రైతుబంధు దుర్వినియోగంపై చర్యలు తప్పవు



**(మొదటిపేజీ తరువాయి)**

సత్తుపల్లి పట్టణంలోని జేవీఆర్ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అవుట్‌డోర్ స్టేడియం పనులకు స్థానిక ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న మంత్రి, రూ.21 వేల కోట్లతో రైతు రుణ మాఫీ అమలు చేశామని, రైతు భరోసా కోసం మరో రూ.9,200 కోట్లు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విద్యా రంగంలో కూడా పలు సంస్కరణలు చేపట్టామని, గత ప్రభుత్వంలో సంవత్సరాల తరబడి బదిలీలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్న ఉపాధ్యాయులకు పారదర్శకంగా బదిలీలు నిర్వహించడంతో పాటు 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామన్నారు. హాస్టల్ విద్యార్థుల డైట్, మెస్ చార్జీలను పెంచడంతో పాటు బాలికలకు కాస్మోటిక్ చార్జీలను కూడా పెంచినట్లు తెలిపారు.గతంలో అద్దె భవనాల్లో నడిచిన రెసిడెన్షియల్ పాఠశాలలకు ప్రస్తుతం శాశ్వత భవనాలు నిర్మించి అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. రాష్ట్రంలోని రహదారుల అభివృద్ధికి ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల ద్వారా రూ.20 వేల కోట్లతో మరమ్మతు పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం సున్నా వడ్డీపై రూ.63 వేల కోట్ల రుణాలు అందించామని, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్ల నిర్వహణ వంటి అవకాశాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇప్పటికే తొలి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. రైతుబంధు దుర్వినియోగంపై స్పందిస్తూ, కొన్ని గ్రామాల్లో వేల ఎకరాలకు బోగస్ పాస్‌బుక్కులు సృష్టించి అక్రమంగా రైతుబంధు పొందినట్లు గుర్తించామని అన్నారు. ప్రతి గ్రామంలో సర్వే నిర్వహించి, వాస్తవ భూస్వాములకు పాస్‌బుక్కులు అందజేసి, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. మట్టా దయానంద్, జిల్లా కలెక్టర్ దివాకర్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ (ఐఏఎస్), ఏసీపీ వసుంధర యాదవ్ (ఐపీఎస్), మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా కమల్ పాషా, వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు ఏఐటియుసి ధర్నా

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ఆటో కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించనున్నారు. ప్రతి ఆటో కార్మికునికి ఏడాదికి రూ. 12వేలు ఆర్థిక సాయం అందించాలని, పెరిగిన పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి ధరలను తగ్గించాలని, ఆటో కార్మికుల కుటుంబాలకు ఉచిత బీమా కల్పించడంతో పాటు ఓలా, రాపిడో వంటి కార్పొరేట్ ఆన్‌లైన్ సర్వీసులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐటియుసి నాయకులు తెలిపారు.

## 10న విద్యా సంస్థల బంద్‌ను

# జయప్రదం చేయండి

**-వామపక్ష విద్యార్థి సంఘాలు**




**ప్రజాపక్షం/ఖమ్మం :** విద్యా రంగసమస్యల పరిష్కారానికి ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు.ఆదివారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వ కళాశాలల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బందికి సంబంధించి ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని కళాశాలల్లో కూడా ప్రవేశపెట్టాలని విద్యార్థినాయకులు డిమాండ్‌చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతుందని ఆరోపించిన విద్యార్థి సంఘాల నాయకులు ప్రైవేటు విద్యపై ప్రభుత్వం నియంత్రణ కోల్పోతుందన్నారు. కొన్ని విద్యా సంస్థలు డొనేషన్లతో పాటు విద్యాలయాలను వ్యాపార సంస్థలుగా మార్చి వేస్తున్నారని అయినా చర్యలు తీసుకోవడం లేదని వారు తెలిపారు. పై సమస్యలపరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు జరిగే విద్యా సంస్థల బంద్‌కు అందరు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మస్తాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి వెంకటేష్, తదితరులు మాట్లాడగా ఏఐఎస్ఎఫ్‌నాయకులు నాగులమీరా, మనోజ్, గోపి, వెంకట్, సుకుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, త్రినాథ్, పిడిఎస్‌యు నాయకులు గాంధీ, శ్రీకాంత్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

## అరాధ్యుడు శ్రీకృష్ణ భగవానుడే



**ప్రజాపక్షం/ఖమ్మం :** గురుపౌర్ణమి సందర్భంగా ఈనెల 29న కృష్ణ భగవానుని జ్ఞానించి భక్తితో పూజలు చేస్తే ఫలితం ఉంటుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఖమ్మం కమిటీ అధ్యక్షులు సత్యం కోరారు. సాయి ప్రభాత్ నగర్‌లో ఇంటింటికి తిరిగి త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయ, సుజాత, అరుణ, లత, కవిత, అఖిల్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి, గిరిజన దర్బారుకు సకారంలో హాజరు కావాలి

**ప్రజాపక్షం/భద్రాచలం ః** ప్రజా సమస్యల పరిష్కారం కోసం వినతులు స్వీకరించే ప్రజావాణి, గిరిజన దర్బార్‌కు అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐడిఓసి, ఐటిడిఏ అధికారులు తెలిపారు. ఉ.1.30 గం.లకు ఐడిఓసిలో ప్రజావాణి, ఐటిడిఏ సమావేశ మందిరంలో గిరిజన దర్బారు ఉంటాయని చెప్పారు. అదే విధంగా భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో కూడా ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని కార్యాలయాధికారులు తెలిపారు.

## సర్ ప్రక్రియలో సిపిఐ శ్రేణులు



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాత పాల్వంచలో 47వ, డివిజన్‌లో భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో కార్పోరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు నేతృత్వంలో ప్రత్యేక ఓటరు సవరణ ( సర్ ) ఫారాల నమోదు ప్రక్రియ ఆదివారం విజయవంతంగా కొనసాగింది. పార్టీ కార్యకర్తలు ఓటర్లకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతీ ఒక్క ఓటరు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఫారాలు పూర్తి చేసేందుకు సహాయ సహకారాలను అందజేస్తున్నారు. ఈ సంధర్భంగా కార్పోరేటర్ జివిఆర్ మాట్లాడుతూ ఓటర్లు సర్ పై ఎలాంటి భయాందోళనకు గురి కావద్దని సూచించారు. ఎలాంటి అనుమానాలు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకొని రావాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరవేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. లేనియెడల ఓటు కోల్పోతారని హెచ్చరించారు. అనంతరం నిర్వాహక సిపిఐ కార్యకర్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో 46వ, డివిజన్ సిపిఐ ఇంచార్జి మస్తాన్, 46వ, డివిజన్ కార్యదర్శి బర్ల వెంకటరత్నం, సహాయ కార్యదర్శి అహ్మద్ జానీ, హుస్సేన్, నాయకులు గౌస్ పాషా, కొట్టు కరీం, ఎండి ఎజాజ్తో తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి**



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం కల్లూరు అభివృద్ధికి శంకుస్థాపన కార్యక్రమాలు చేశారు. ఎన్ఎస్పి క్రాస్ రోడ్డులో ఆరు కోట్లతో జంక్షన్ అభివృద్ధికి , నగరాభివృద్ధి నిధుల ద్వారా రూ 93 లక్షలతో సిసి రోడ్లు డ్రైనేజీ కొరకు, కల్లూరు టూ లోకవరం వెళ్లే రహదారిలో పుల్లయ్య బంజర వద్ద ,ఆర్ అండ్ బి నిధులతో రూ 6.30 కోట్లుతో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించారు. అదేవిధంగా చిన్న కోరుకొండిలోని చిన్న కోరుకొండి టు నెమలి వెళ్లే రహదారికి రూ ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో 6 కోట్లతో నిర్మిస్తున్న బీటీ రహదారికి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ మోహన్ నాయక్ కలెక్టర్ దివాకర్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఏసిపి వసుంధర యాదవ్ మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజాదేవి మున్సిపాలిటీ కమిషనర్ జి. సాయి కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు చిన్న కోరుకొండి సర్పంచ్ గీతారెడ్డి తహసిల్దార్ పలు శాఖల బ్రహ్మేశ్వర రావు ఎంపీఓ సురేష్ బాబు , పలు శాఖల అధికారులు తదితరులు కౌన్సిలర్లు సర్పంచులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పైలేరియా నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం

**-ట్రాన్స్మిషన్ అసెస్మెంట్ సర్వేకు సహకరించండి**
**-డిఎంఅండ్హెచ్ఓ డాక్టర్ డి రామారావు**

**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగంః** ఫైలేరియా వ్యాధి నిర్మూలనలో భాగంగా రాష్ట ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం హైదరాబాద్ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లాలో ట్రాన్స్మిషన్ అసెస్మెంట్ సర్వే(టిఏఎస్)ను ఈ నెల 06వ తేది నుండి 18వ తేది వరకు జిల్లాలో నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి రామారావు తెలిపారు. ఈ సర్వే జిల్లాలో గంగారం, లంక సాగర్, వేంసూర్, తల్లాడ, ఏన్కూర్, కల్లూరు, చెన్నూరు, బోనకల్, బనిగండ్లపాడు, మాటూరిపేట, దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గుర్తించిన 31 గ్రామాలలో నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు.



ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన గ్రామాలలోని గుర్తించిన గృహాలను సందర్శించి, 20సంవత్సరాలు నిండిన వ్యక్తులకు పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి గ్రామంలో సుమారు 105 మంది అర్హులైన వ్యక్తులకు పరీక్షలు చేసి ఫైలేరియా వ్యాధి సోకిందా లేదా అనే విషయాన్ని నిర్ధారిస్తారు. సర్వే సందర్భంగా ఎంపిక చేసిన ఇంటిలోని అర్హులైన కుటుంబ సభ్యులందరికీ పరీక్షలు నిర్వహించబడతాయి.

# తూము ప్రకాశరావు ఆశయాలను కొనసాగిద్దాం

**-సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్**






**ప్రజాపక్షం/బోనకల్ః** పేద, దళిత ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన తూము ప్రకాశరావు ఆశయాలను కొనసాగిద్ధామని సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్ కోరారు. మండల కేంద్రంలోని తూము ప్రకాశరావు భవన్‌లో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం ప్రతి నెల మొదటి అదివారం నిర్వహించే బిపి, షుగర్ 80వ ప్రత్యేక క్యాంపు విజయవంతమైంది. ఈ సందర్భంగా తూము రోషన్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత మధిర తాలుకాలోని పల్లెలు అభివృద్ధి చెందాయంటే ఆనాడు కమ్యూనిస్టు నాయకులు చేసిన త్యాగాల ఫలితాలేనని అన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం, ముఖ్యంగా దళితులు అభివృద్ధి కోసం ఎందరో కమ్యూనిస్టు నాయకులు పోరాటాలు చేశారని, ఆ పోరాటాల కోసం తమ జీవితాలను త్యాగం చేశారన్నారు. కలకోట, రాయన్నపేట గ్రామాల అభివృద్ధి చెందడం కోసం, ఆ గ్రామాల్లోని దళితులు అభివృద్ధి బాటలో నడవడానికి సమసమాజ రాజ్యం తేవడానికి తూము ప్రకాశరావు అమరుడయ్యారన్నారు. కలకోట, రాయన్నపేట గ్రామాల్లో ఎస్సీ కాలనీ నిర్మాణం కోసం, దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం కలకోట చేపల సోసైటిని దళితులకు చెందేలా ప్రకాశరావు పోరాటం చేశారని, ఆ పోరాటంలో ఆయన సఫలీకృతడయ్యారన్నారు. కలకోట, రాయన్నపేట, ఆళ్లపాడు, సిరిపురం, మల్లవరం గ్రామాల్లో భూపోరాటం ద్వారా బంజరు భూములను పంపిణీ చేశారని గుర్తుచేశారు. ఆ పోరాటం ఫలించడం సహించలేని పెత్తందారీ వర్గాలు ప్రకాశరావుని దారుణంగా అంతమొందించారన్నారు. నేటికి ప్రకాశరావు మరణించి 43 ఏళ్లు అవుతున్నా ఈ ప్రాంతంలోని ప్రజులు ఆయన గుర్తు పెట్టుకున్నారంటే ఆయన త్యాగం ఎంతో గొప్పదో ప్రస్తుత యువత ఆలోచన చేయాలని అన్నారు. నాటి నేటి నుండి వరకు ప్రకాశరావు ఆశయాలను కొనసాగిస్తూ, మా కుటుంబమంతా ఆయన బాటలోనే నడుస్తున్నామని అన్నారు. ఈ క్యాంపులో వైద్యులు సదానందం, మధుసూదన్‌లు వైద్యసేవలందించగా, క్యాంపు సహయకులు క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపుకు 100 మందికి పరీక్షలు నిర్వహించి, నెలకు సరిపడ నాణ్యమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, ఆర్ఎంపిడబ్ల్యూఏ టిఏస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు, సిపిఐ మండల నాయకులు ఆకెన పవన్, ఏలూరి పూర్ణచంద్, టిడిపి నాయకులు దుగ్గి భద్రయ్య, క్యాంపు సహయకులు గిరి, గోపి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫామ్స్ తప్పలు లేకుండా పూర్తి చేయాలి

**-ఎస్ఐఆర్ పట్ల జాగ్రత్తగా ఉండాలి**
**-బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు**



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫామ్స్‌ను కట్టా కృష్ణార్జునరావు పరిశబులించారు. అనంతరం కట్టా కృష్ణార్జునరావు మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫామ్స్ ఎలాంటి తప్పుల్లేకుండా ప్రతి కాలాన్ని పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఓటర్ పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫామ్‌ను తప్పకుండా సరిచూసుకోవాలని అన్నారు. 2002లో ఓటరుగా నమోదైన వారు, ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాలో సరి చూసుకోవాలి, ఏదైనా తప్పుగా అనిపిస్తే అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యుల వివరాలు మ్యాపింగ్ చేసుకొని, పూర్తి వివరాలు నిర్ధారణ అయిన తర్వాతే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రతిఒక్కరూ ఎస్ఐఆర్ పట్ల జాగ్రత్తగా ఉండాలి. ఎక్కడ ఎలాంటి ఇబ్బంది రాకుండా ఓట్లు పోకుండా చూడాలని కట్టా కృష్ణార్జునరావు కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏదునూరి శ్రీనివాసరావు, విలాసాగరం నరేష్, ఆదూరి ప్రేమ్, వజినేపల్లి చక్రవర్తి, వేముల శివకుమార్, రాము, విలాసాగరం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ గుడి నిర్మాణానికి ఏర్పాట్లు

**కులాలకు అతీతంగా పాల్గొన్న ప్రజలు**



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ పరిధజలోని 1,2,3,4 వార్డులకు సంబంధించి కులాలకు అతీతంగా అన్ని కులాల వారు 2వ వార్డులోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా చెరువు సమీపంలో ఉన్న 130 సంవత్సరాలు చరిత్ర కలిగిన పురాతన ముత్యాలమ్మ తల్లి విగ్రహానికి ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో పెద్ద ఎత్తున భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. అలాంటి పురాతన చరిత్ర కలిగిన ముత్యాలమ్మ తల్లి వద్ద గుడిని నిర్మించేందుకు అన్ని కులాల వారి సహకారంతో నూతన నిర్మాణానికి కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పలు వార్డుల ప్రజలు మాట్లాడుతూ ముత్యాలమ్మ తల్లి గుడి కట్టడానికి అందరం ముందకు వస్తున్నామని వైరా మున్సిపాలిటీలో చాలా మంది గుడి నిర్మాణానికి చేయూతని అందించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కులాలకు అతీతంగా పలు వార్డుల్లో ప్రజలు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య లేకుండా చూడండి



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్ అవుతున్న విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ భగీరథ అధికారులతో మాట్లాడి మరమ్మత్తులు చేయాలని తెలపడంతో ఆదివారం పనులు చేపట్టారు. ఈ లీకేజి పనులను వైస్ చైర్మన్ కట్ల సంతోష్ పరిశీలించారు. త్వరగా లీకుల మరమ్మత్తుల పూర్తి చేయాలని ప్రజలకు త్రాగునీటి ఇబ్బంది కలగకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి కిరణ్, పలువురు మిషన్ భగీరథ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

**ప్రజాపక్షం/వైరాః** వైరా ఇందిరమ్మ కాలనీకి చెందిన కర్నాటి అవినాష్‌రెడ్డి(40) సంవత్సరాలు శనివారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో తన ఇంట్లోనే సీలింగ్‌కు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతిని భార్య కర్నాటి నందిని ఫిర్యాదు ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు వైరా మున్సిపల్ ఆఫీస్ నందు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత రెండు సంవత్సరాలు క్రితం తీవ్రమైన వెన్నపూస నొప్పి రావడం వలన సర్జరీ చేయించుకోవడం జరిగింది. అయినప్పటికీ నొప్పి తగ్గకపోవడంతో తరచుగా బాధపడేవాడు నొప్పి తట్టుకోలేక పలుమార్లు చనిపోవాలని ఉందని తన భార్యకు కుటుంబ సభ్యులకి తెలిసేవాడు అని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగింది. అవినాష్‌రెడ్డి మరణం పట్ల ఎలాంటి అనుమానం లేదని భార్య తెలపడం జరిగిందని వైరా ఎస్సై పుప్పాల రామారావు తెలిపారు.

# మున్సిపల్ కార్మికుడు అవినాష్‌రెడ్డికి నివాళి



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీలో ఎలక్ట్రిషన్ కార్మికుడిగా పనిచేస్తున్న కర్నాటి అవినాష్ రెడ్డి మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ అవినాష్‌రెడ్డి భౌతికఖాయం వద్ద పూలమాల వేసి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు, జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, చెరుకూరి కిరణ్, పలువురు రాజకీయ పార్టీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదానికి గురైన సురేష్‌కు పరామర్శ



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో పసుపులేటి సురేష్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కాలు ఫ్యాక్చర్ అయిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు సురేష్ ఇటికెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసకున్నారు. పరామర్శించిన వారిలో ఏదునూరి శ్రీనివాసరావు, ఆదూరి ప్రేమ్, విలాసాగరం నరేష్, వజినేపల్లి చక్రవర్తి, వేముల శివ, విలాసాగరం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రికి మున్సిపాలిటీ కార్మికుల వినతి



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని మున్సిపాలిటీ కార్మికులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఆదివారం మున్సిపాలిటీ అభివృద్ధికి శంకుస్థాపనలు కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా మున్సిపాలిటీ కార్మికుల కు గత 9 నెలలుగా వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నామని వేతనాలు అందించి మా ఆకలి మంటలను తీర్చాలని కోరుతూ మంత్రికి ప్రాధేయపడ్డారు కుటుంబ భారంతో జీవనం ముందుకు సాగటం కష్టంగా ఉందని నిత్యవసరాలు తీర్చేందుకు అప్పుల భారంతో పిల్లలు చదువులు స్కూల్ ఫీజులు నిత్యవసరాలతో పాటు అనేక అవసరాలను తీర్చుకునేందుకు అప్పుల భారంతో అష్ట కష్టాలు పడుతూ ఇబ్బందులు పడుతున్నామని మంత్రికి మొరపెట్టుకున్నారు. త్వరలో మీ వేతనాలను అందిస్తామని ఆందోళన చెందవద్దని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మున్సిపాలిటీ సంఘం నాయకులు వజేర్మియా ప్రకాష్ చిన్న ,అంజలి తోపాటు తదితర మున్సిపాలిటీ కార్మికులు పాల్గొన్నారు.

## గిరిజన గురుకుల పాఠశాలను సందర్శించిన జోనల్ అధికారి అపర్ణ



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లిలోని కవిత ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొన సాగుతున్న ఇల్లందు తెలంగాణ గిరిజన బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలను భద్రాద్రి(4వ)జోనల్ అధికారి పోతుల అపర్ణ సందర్శించారు. వంట శాల, తరగతి గదులు, వసతి గృహాలు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యార్థులకు అందిస్తున్న పోష కాహారం, విద్యా ప్రమాణాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈసందర్భంగా పోతుల అపర్ణ మాట్లాడుతూ సోమవారం ఇంటర్మీడియట్ అన్ని గ్రూపుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లా విద్యార్థులకు తిరుమలయ పాలెం(బాలురు), టేకులపల్లి(బాలికలు), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యార్థులకు అన్నపురెడ్డిపల్లి(బాలురు), ములకలపల్లి(బాలికలు) కేంద్రాల్లో ప్రవేశాలు కల్పిస్తామని, అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గురుకులాల్లో నాణ్యమైన విద్య పౌష్టికాహారం, మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వాణి, వైస్ ప్రిన్సిపాల్ రత్నలత, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల కోసం కమ్యూనిస్టుల పోరాటం



**ప్రజాపక్షం/చింతకాని :** నీళ్లలో చేపల లాగా కమ్యూనిస్టులు నిత్యం ప్రజలలో ఉంటూ క్షేత్ర స్థాయిలో ఉంటూ కార్మిక వర్గ రాజ్యం కోసం పోరాటాలు చేస్తుంటారని సీపీఎం రాష్ట్ర కార్య దర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం చింతకాని మండలం నాగులవంచ లో జరుగుతున్న సీపీఎం మధిర డివిజన్ రాజకీయ శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడుతూ కమ్యునిస్టులు త్యాగానికి ప్రతిరూపం అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో ఉంటూ ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేయగలిగితే భవిష్యత్తు మనదేనన్నారు. సామ్రాజ్యవాదానికి, పెట్టుబడీదారి విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం నిరంతరం పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. రాముడి పేరుతో అధికారంలోకి వచ్చిన బీజేపి అయోధ్యలో ఆ దేవుడి నగలు మాయం చేసిందన్నారు. ఎన్ని అవంతరాలు ఎదురైనా కమ్యునిస్టులు నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, పాపినేని రామనర్సయ్య, మండల కార్యదర్శులు, శాఖ కార్యదర్శులు, ప్రజాసంఘాల భాధ్యులు పాల్గొన్నారు.

## తమ్మినేని సుబ్బయ్య ట్రస్ట్ సేవలు అభినందనీయం

**- సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** మెడికల్ క్యాంపు ద్వారా పేద ప్రజలకు వైద్య సదుపాయాలు అందిస్తున్న తమ్మినేని సుబ్బయ్య ట్రస్ట్ సేవలు అభినందనీయం అని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులోని తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో ప్రతి నెల మొదటి ఆదివారం నిర్వహిస్తున్న మెడికల్ క్యాంప్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంపుకు వచ్చే రోగులకు కాళ్ల రామారావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ఎన్ని ఇబ్బందులు ఎదురైన ట్రస్ట్‌ను నిరంతరాంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే అల్పాహారాన్ని ఏర్పాటు చేసిన కాళ్ల రామారావు ట్రస్ట్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలేరుడివిజన్ కార్యదర్శి బండి రమేష్, మున్సిపాలిటీకార్యదర్శి ఊరడి సుదర్శన్‌రెడ్డి, రూరల్ మండల కార్యదర్శి వడ్లమూడి నాగేశ్వరరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ సుబ్బారావు, జిల్లా కమిటీ సభ్యులు నందిగామ కృష్ణ, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, మండల నాయకులు తోట నరేష్‌రెడ్డి, గోగుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాములు కుటుంబానికి అండగా సర్పంచ్ దండు ప్రవీణ్



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం అప్పాయిగూడెం గ్రామ పంచాయితీ పరిధిలోని భిక్యతం డాకు చెందిన బాదావత్ రాములు అనారోగ్యంతో మృతి చెందడంతో, గ్రామ సర్పంచ్ దండు ప్రవీణ్ వారి పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా తన వ్యక్తిగత సంత్వన నిధి నుంచి రూ 5వేలను ఆర్థిక సహాయాన్ని అందజేశాను. అలాగే స్థానిక ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్ ఆదేశాల మేరకు ఆయన ప్రధాన అనుచరుడు ఎస్ఎన్ నాయక్ దశ దిన కార్యక్రమం కోసం 100కిలోల బియ్యం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ దండు ప్రవీణ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పాడి పరిశ్రమ రైతులకు వరం..!

**- పాల ఉత్పత్తితో పెరుగుతున్న ఆదాయం**
**- ఆధునిక పద్దతులతో అధిక లాభాలు**







**ప్రజాపక్షం/తల్లాడ:** వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమ నేడు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారంగా నిలుస్తోంది. పంటల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు ప్రతీ రోజూ పాల విక్రయాల ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తోంది. దీంతో అనేక మంది రైతులు పాడి పశువుల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. పాడి రైతులకు సబ్సిడీలు, పశువైద్య సేవలు, కృత్రిమ గర్భధారణ, ఉచిత టీకాలు, మేత అభివృద్ధి కార్యక్రమాలు అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిని సద్వినియోగం చేసుకుంటే రైతులు మరింత లాభాలు పొందే అవకాశం ఉంది. అధిక పాల దిగుబడి కోసం మంచి జాతి ఆవులు, గేదెలను ఎంపిక చేయడం అత్యంత అవసరం. పరిశుభ్రమైన పశువుల శాల, స్వచ్ఛ మైన తాగునీరు, సమతుల్య ఆహారం, పచ్చి మేత, పొడి మేత, ఖనిజ మిశ్రమాలు అందించడం ద్వారా పాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. పశువులకు సమయానికి టీకాలు వేయించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ద్వారా అనేక అంటువ్యాధులను నివారించవచ్చు. ముఖ్యంగా వర్షాకాలంలో పశువుల కొట్టాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని పశుసంవర్ధన శాఖ అధికారులు సూచిస్తున్నారు. పాల సేకరణ కేంద్రాల ద్వారా రైతులు తమ పాలను విక్రయించడం వల్ల సరైన ధర లభించడమే కాకుండా చెల్లింపులు కూడా పారదర్శకంగా జరుగుతున్నాయి. పాల నాణ్యతను కాపాడటం ద్వారా మరింత మంచి ధర పొందే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం చాలామంది యువ రైతులు ఆధునిక పాడి పరిశ్రమ వైపు అడుగులు వేస్తున్నారు. ఆటోమేటిక్ మిల్కింగ్ యంత్రాలు, సైలేజ్ తయారీ, శాస్త్రీయ మేత నిర్వహణ వంటి ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు. గ్రామీణ మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా పాల ఉత్పత్తి తయారీ చేపట్టి స్వయం ఉపాధిని పొందుతున్నారు. పాడి పరిశ్రమలో పశువుల సంక్షేమానికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలి. పశువులకు తగిన విశ్రాంతి, శుభ్రమైన వాతావరణం, సరైన పోషకాహారం అందిస్తే అవి ఆరోగ్యంగా ఉండి, ఎక్కువ కాలం పాల ఉత్పత్తి చేస్తాయి. పాడి పరిశ్రమ పర్యావరణానికి కూడా మేలు చేస్తుంది. పశువుల పేడను సేంద్రీయ ఎరువుగా, బయోగ్యాస్ తయారీలో ఉపయోగించడం వల్ల వ్యవసాయ ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుంది. నిపుణుల సలహాలు, సూచనలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో పాడిపశువులను పెంచితే రైతుల ఆదాయం రెట్టింపు కావచ్చని అధికారులు చెబుతున్నారు. పంటలతోపాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం అవుతుందని వారు పేర్కొంటున్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని, పశుసంవర్ధన శాఖ అధికారుల సలహాలను పాటిస్తూ పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పాడి పరిశ్రమను ఒక ఉపాధి మార్గంగా కాకుండా, శాశ్వత ఆదాయవనరుగా అభివృద్ధి చేసుకుంటే రైతు కుటుంబాల ఆర్థిక పరిస్థితి మరింత మెరుగుపడుతుందని అభిప్రాయ పడుతున్నారు.

# ప్రజాపక్షం కథనాలపై కలెక్టర్ ఆరా..?

**- రియల్ ఉపాధ్యాయులకు కౌంట్ డౌన్**
**- తెర వెనక వ్యాపారాలకు చెక్ పడేనా?**




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే రియల్ ఎస్టేట్, ఇన్సూరెన్స్ తదితర ప్రైవేట్ వ్యాపారాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులపై ప్రజాపక్షం వరుసగా ప్రచురిస్తున్న కథనాలు అధికార యంత్రాంగంలో ప్రకంపనలు రేపుతున్నట్లు సమాచారం. ఇప్పటికే నిఘా వర్గాలు వివరాలు సేకరించాయని ప్రచారం కొనసాగుతుండగా, తాజాగా జిల్లా కలెక్టర్ సైతం ఈ వ్యవహారంపై ఆరా? తీసినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఉద్యోగుల జాబితా, వారి కార్యకలాపాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఈ పరిణామంతో ఇప్పటివరకు నిర్భయంగా వ్యవహరించిన కొందరు ఉపాధ్యాయుల్లో ఒక్కసారిగా ఆందోళన నెలకొన్నట్లు సమాచారం. ఇంతకాలం తెరవెనుక సాగినట్టు చెబుతున్న రియల్ ఎస్టేట్, ఇన్సూరెన్స్ తదితర వ్యాపారాలపై ప్రజాపక్షం వరుస కథనాలు వెలుగులోకి తేవడంతో వ్యవహారం జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు చేరిందని స్థానికంగా చర్చ సాగుతోంది. త్వరలోనే అధికారిక విచారణకు రంగం సిద్ధమవుతుందనే ప్రచారం కూడా వినిపిస్తోంది. ప్రభుత్వ సేవలో ఉంటూ ఇతర వ్యాపారాల్లో పాల్గొనడం ఉద్యోగ నియమావళికి విరుద్ధమవడంతో సంబంధిత వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో ఇక ఎవరి పేర్లు బయటకు వస్తాయో? ఎవరిపై చర్యలు మొదలవుతాయో? అన్న ఉత్కంఠ సంబంధిత వర్గాల్లో నెలకొంది. మరోవైపు వాస్తవ పరిస్థులను వెలుగులోకి తీసుకొస్తున్న ప్రజాపక్షం కథనాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండగా, సంబంధిత వర్గాల్లో మాత్రం తీవ్ర కలకలం రేగుతున్నట్లు తెలిసింది.

## ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి




**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పాల్వంచ ఏహెచ్ఎస్‌లో జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తగిన బడ్జెట్ కేటాయించకపోవడం వల్లే విద్యావ్యవస్థ బలహీనపడుతోందని ఆయన ఆరోపించారు. కార్పొరేట్ విద్యా విధానాలను ప్రోత్సహించడం ఆందోళనకరమని తెలిపారు. 23వేల పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, రేషనలైజేషన్ జీవో 25ను సవరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ సమస్యలపై కూడా ఆయన స్పందిస్తూ, పిఆర్సి వెంటనే ప్రకటించి అమలు చేయాలని, మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పిఆర్సి, ఆరు డీఏలు విడుదల చేయాలన్నారు. అలాగే సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఇవ్వాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖలో బదిలీలు, పదోన్నతులు, సిఆర్టీల రెగ్యులరైజేషన్, కేజీబీవీ సిబబదికి మినిమం టైమ్ స్కేల్, పెండింగ్ బిల్లుల విడుదల, హెల్త్ కార్డుల అమలు వంటి డిమాండ్లు కూడా సమావేశంలో వినిపించారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం టిపిటిఎఫ్ కట్టుబడి పని చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యలను పరిష్కరించాలి

**-యూరియా యాప్‌ను ఎత్తి వేయాలి**
**-13న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయండి**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా**






**ప్రజాపక్షం/పాల్వంచ :** పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని, యూరియా యాప్‌ను ఎత్తి వేయాలని తదితర రైతాంగ సమస్యలను పరిష్కరించాలంటూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ( ఏఐకేఎస్ ) ఆధ్వర్యంలో ఈ నెల 13వ, తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు రైతులు, వ్యవసాయ కూలీలు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సిపిఐ జుల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథంలు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయం చండ్రా రాజేశ్వరరావు భవన్‌లో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు చండ్రా నరేంద్ర కుమార్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజేపి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని ఆరోపించారు. కార్పోరేట్ వర్గాలకు అనుకూలంగా చట్టాలను తీసుకొస్తూ రైతాంగానికి గొడ్డలి పెట్టులా వ్యవహరిస్తున్నదని, రైతాంగానికి కావలసిన విత్తనాలు, డిఏపి తదితర కాంప్లెక్స్ ఎరువుల ధరలను పెంచి రైతుల నడ్డి విరుస్తున్నదని మండిపడ్డారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించటంలోను అన్యాయం చేస్తుందని విమర్శించారు. దీనితో రైతాంగం తీవ్ర నష్టాల భారిన పడుతూ అప్పుల భారిన పడుతున్నారని వాపోయారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేక రైతాంగాన్ని అయోమయానికి గురిచేస్తున్నదని, ఎకరాకు 15 వేయిల చొప్పున రైతు భరోసా ఇస్తామని చెప్పి తీరా 6 వేయిలకు కుదించారన్నారు. రైతు భరోసాను సకాలంలో అందించక పోవటంతో రైతు లు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్పష్టం చేశారు. రెండు లక్షల రుణమాఫి పూర్తి స్థాయిలో అమలు చేయాలని, రైతులకు గుదిబండగా మారిన యూరియా యాప్‌ను ఎత్తివేసి బహిరంగ మార్కెట్‌లో యూరియా విక్రయాలకు అనుమతివ్వాలన్నారు. పండించిన పంటలకు మద్దతు ధరలను కల్పించి రైతాంగాన్ని అప్పుల భారి నుండి కాపాడాలన్నారు. అన్ని రకాల వరి పంటలను కొనుగోలు చేసి బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా రాంమూర్తి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సలిగంటి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, హనుమంతరా వు, గుగులోత్ రామచంద్రు, ఉప్పుశెట్టి సునీల్, నిమ్మల రాంబాబు, రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు వైఎస్. గిరి, కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్లు వాడె లక్ష్మి, సపావత్ రవి, బానోత్ రవి, నాగేశ్వరరావు, బానోత్ విజయ్‌కుమార్, గుగులోత్ భద్రు, ఇమ్మానుయేల్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి, పాండవుల భిక్షం తదితర జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# రైతు సేవలో కారేపల్లి సహకార సంఘం

**-సహకార వారోత్సవాల్లో మహాజన సభ**
**-ఘనంగా వనమహోత్సవం నిర్వహణ**




**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి సహకార సంఘం రైతు సంక్షేమానికి అంకితభావంతో పని చేస్తోందని సంఘం అధ్యక్షుడు దుగ్గినేని శ్రీనివాసరావు, సింగరేణి గ్రామ పంచాయితీ సర్పంచ్ మేదరి వీరప్రతాప్(టోనీ) అన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన మహాజన సభలో వారు మాట్లాడారు. రైతులకు యూరియా నిరంతరం అందుబాటులో ఉండేలా ఆరు విక్రయ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్నామని తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌పీవో)ఏర్పాటు చేసి, తక్కువ ఖర్చుతో వ్యవసాయ సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పంటలపై పురుగుమందుల పిచికారీ కోసం త్వరలో డ్రోన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. సంఘంలో రుణాలు పొందిన రైతులు తప్పని సరిగా రుణాలను పునరుద్ధరించుకోవాలని, సకాలంలో వడ్డీలు చెల్లించి 3శాతం వడ్డీ రాయితీ పొందాలని సూచించారు. అనంతరం సంఘం ప్రాంగణంలో వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో సంఘం కార్యదర్శి బొల్లు హనుమంతరావు, డైరెక్టర్లు దేగల ఉపేందర్, అడ్డగోడ ఐలయ్య, మర్సకట్ల రోషయ్య, మధ్యాహ్నపు శ్రీను, వడ్డె ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# అంతరించిపోతున్న ప్రాచీన కాకతీయల కట్టడాలు..!

**- జల్లేపల్లి గుట్టల్లో శ్రీకృష్ణదేవరాయల ఆనవాళ్లు**







**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** తెలంగాణ ప్రభుత్వం ప్రాచీన కట్టడాలకు ఎంతో ప్రాముఖ్యత నిస్తూ ప్రాచీన కట్టడాలను పునరుద్ధరించి పర్యాటక కేంద్రంగా గుర్తించి తెలంగాణ ప్రాముఖ్యతను ప్రపంచదేశాలకు తెలియజేస్తూ తెలంగాణ ప్రాముఖ్యతను కాపాడుతుంటే ఖమ్మం జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్న తిరుమలాయపాలెం మండల పరిధిలోని జల్లేపల్లి గ్రామంలో విశాలమైన ఎత్తైన గుట్టలో ప్రాచీన కాకతీయుల కట్టడాలు ప్రకృతి సోయగల మధ్య అహ్లాదకర వాతావరణంలో ఉన్నాయి. క్రీస్తు పూర్వం 500ల సంవత్సరాల క్రితం విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన బహుప్రజ్ఞాశాలి, కవికోవిధుడు తెలుగు భాషను ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు దండయాత్ర చేసుకుంటూ జల్లేపల్లి గుట్టలో కొంతకాలం నివాసం ఉన్నట్లు పురావస్తు శాఖలో లిఖితపూర్వకంగా నమోదు చేసినట్లు అధికారులు గుర్తించి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని హంపి, తిరుపతి, హైదరాబాద్, ప్రధాన నగరాల్లో నిర్వహించారు. 2009జూలై, ఆగస్టు నెలలో పంచాయతీ శతాబ్ధి ఉత్సవాలను నిర్వహించింది. అప్పటి ఖమ్మం జిల్లా కలెక్టర్ నాగేశ్వరరావు, జల్లేపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం ప్రతిష్టించారు. జల్లేపల్లి గుట్టల్లో రాతి కట్టడాలతో కట్టిన సింహద్వారం కల్యాణ మండపం కోనేరు ప్రాచీన కట్టడాల్లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రహస్యంగా రాత్రి సమయాల్లో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు స్థానికులు తెలుపుతున్నారు. కానీ పర్యాటక అధికారులు మాత్రం జల్లేపల్లి గుట్టల ప్రాముఖ్యతను భావితరాలకు తెలియజేయాల్సినవసరం ఎంతైనా ఉందని స్థానికులు, ప్రజలు కోరుతున్నారు.

## గ్రావెల్‌తో రహదారి గుంతల పూడ్చివేత

**-వాహనదారుల ఇబ్బందుల నివారణకు గ్రామ పంచాయితీ చర్యలు**



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలం ఆనందపురం గ్రామ పంచాయితీ పరిధిలో ఆనందపురం, సీతారాంపురం ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను గ్రావెల్‌తో పూడ్చే పనులు చేపట్టారు. రహదారి దెబ్బతినడంతో గ్రామస్తులు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ ముర్రం సమ్మయ్య, ఉప సర్పంచ్ దేవనబోయిన మహేష్ ఆధ్వర్యంలో పనులు నిర్వహించారు. తాత్కాలికంగా రాకపోకలు సులభతరం చేసేందుకు గుంతలను గ్రావెల్‌తో పూడ్చామని, త్వరలో శాశ్వత రహదారి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు సిద్ది రవికుమార్, గ్రామ పంచాయితీ సిబ్బంది, కాట్రాజు కొండలరావు, తంగేడు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## భారతికి ఘన సన్మానం



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం మండల తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పదవీ విరమణ పొందిన కంగాల భారతిని ఆదివారం రాజుపేట కాలనీలోని ఆమె నివాసంలో ఆదివాసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో నిష్పక్షపాతంగా, ప్రజలకు చిరునవ్వుతో సేవలందించిన ఉద్యోగిగా కంగాల భారతి గుర్తింపు పొందారని కొనియాడారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమని, పదవీ విరమణ అనంతరం కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఆమెకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో కూడిన జీవితం కలగాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ భద్రాచలం ఇన్‌చార్జి మానే రామకృష్ణ, ఏవీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు సొందె మల్లుదొర, పిసోడి మారయ్య, ఆదివాసీ పెద్ద తెల్లం రమణయ్య, ఏటీపి రాష్ట్ర నాయకుడు కొమరం నాగయ్య, వర్ష వసంత్, పాల్గొన్నారు.

## పెద్ద కమలాపురంలో త్రీఫేస్ విద్యుత్ ప్రారంభం



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం మండలం పెద్ద కమలాపురం గ్రామంలో వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటు చేసిన 65కేవీఏ త్రీఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను భద్రాచలం మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ తెల్లం సీతమ్మ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీటిని పొదుపుగా వినియోగిస్తూ, తక్కువ నీటితో సాగు చేసే పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తెల్లం హరికృష్ణ, పెద్ద కమలాపురం సర్పంచ్ సరియం ధనలక్ష్మీ, కాంగ్రెస్ యువ నాయకులు కాగితాల శివకుమార్, యాగడ్డి విష్ణు, వర్ష ప్రసాద్, వర్ష చంటి, మడకం లక్ష్మయ్య, మడకం రామారావు, మహిళలు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా గంగమ్మ తల్లి బోనాల జాతర



**ప్రజాపక్షం/ఏన్కూరు:** మండల కేంద్రం ఏన్కూరులో యాదవ సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి బోనాల జాతర ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయాన్నే మహిళలు ముత్యాలమ్మ, బొడ్రాయి, మైసమ్మ తల్లులకు జలాభిషేకం చేసి పూజలు చేశారు. పంటలు సమృద్ధిగా పండాలని, వర్షాలు సమయానికి కురవాలని, గ్రామాన్ని రోగాల నుంచి కాపాడాలని గంగమ్మ తల్లిని వేడుకుంటూ బోనాలు సమర్పించారు. మహిళలు, చిన్నారులు తమ ఇళ్లలో పాటు పొంగించి బోనాలు సిద్ధం చేసి, ప్రభబండితో ఊరేగింపుగా వెళ్లి గంగమ్మ తల్లికి, ఇతర గ్రామ దేవతలకు ప్రసాదాలు సమర్పించారు. ఈకార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు చీటీ ముత్తయ్య, చీటీ నరసింహారావు, భిక్షపతి, కళ్యాణ్, నాగరాజు, పదిమల వెంకటేశ్వర్లు, వెంకటేష్, బ్రహ్మం, మురళీకృష్ణ, పాముల నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## 36ఏళ్ల సేవలకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** రాజుపేట కాలనీలో రెవెన్యూ శాఖలో 36 సంవత్సరాల పాటు సేవలందించి పదవీ విరమణ పొందిన కంగాల భారతి పదవీ విరమణ మహోత్సవం ఘనంగా ఆదివారం జరిగింది. ఈకార్యక్రమానికి భద్రాచలం ఎంఎల్ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్యఅతిథిగా హాజరై, కంగాల భారతిని శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ ఆమె సేవలు ఆదర్శప్రాయమని, ఉద్యోగ జీవితంలో నిబద్ధతతో ప్రజలకు సేవలందించారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కుటుంబంలో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో మూడు రోజుల పాటు శిక్షణాతరగతులు

**- సమకాలీన రాజకీయాలపై ప్రముఖుల విస్తృతబోధన**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాచలంలో మూడు రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా రాజకీయ శిక్షణా తరగతులు జరుగనున్నాయని, సమకాలీన రాజకీయ అంశాలపై ప్రముఖులు ఇందులో విస్తృతంగా బోధన చేయనున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా తెలిపారు. ఈనెల 7,8,9 తేదీల్లో సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల సమితి సభ్యుల రాజకీయ శిక్షణా తరగతులు భద్రాచలంలో జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయ శిక్షణా తరగతులతోనే పార్టీ సిద్ధాంత పరిపుష్టి, బలోపేతం సాధ్యమవుతాయని తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక శిక్షణా తరగతుల్లో ఇరు జిల్లాల నుండి సుమారు 300 మంది సమితి సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ తరగతులను సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ ప్రారంభించనున్నారు. ముఖ్యాతిధిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు పాల్గొననున్నారన్నారు. మూడు రోజుల పాటు సాగే ఈ తరగతుల్లో ప్రెస్ అకాడమి చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి, ప్రొఫెసర్ యుగల్ రాయలు, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు మోహన్ రెడ్డి, సోమసుందర్ ఎస్ వేణుగోపాల్, చలసాని వెంకట రమారావు, భాగం హేమంతరావు, వి మల్లిఖార్జునరావులు పలు ముఖ్యాంశాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. పార్టీ బలోపేతానికి ఎంతో ఉపయోగపడే ఈ శిక్షణా తరగతులను సిపిఐ శ్రేణులు, సమితి సభ్యులు హాజరై విజయవంతం చేయాలని సాబీర్ పాషా పిలుపునిచ్చారు.

# పెద్దల పనులు చకచకా..సామాన్యుల పనులు పెండింగ్!

**-ప్రభుత్వ కార్యాలయాల పనితీరుపై**
**మండల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి**




**ప్రజాపక్షం/బోనకల్‌:** మండలంలోని పలు ప్రభుత్వం కార్యాలయాల పనితీరుపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం, మండల ప్రజాపరిషత్ కార్యాలయం, విద్యుత్ శాఖ, పోలీసు స్టేషన్‌తో పాటు ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పలుకుబడి ఉన్న వ్యక్తులు, ప్రజాప్రతినిధులు లేదా ప్రత్యేక సిఫారసులు ఉన్న వారి పనులు వేగంగా పూర్తవుతుండగా, సామాన్య ప్రజల దరఖాస్తులు, సమస్యలు మాత్రం రోజుల తరబడి, నెలల తరబడి పెండింగ్‌లోనే ఉంటున్నాయని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రైతుల భూ సమస్యలు, పహాణీలు, మ్యూటేషన్లు, వారసత్వ నమోదు, విద్యుత్ కనెక్షన్లు, ఇతర ప్రభుత్వ సేవలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల సమస్యలు వినేందుకు, సామాన్య ప్రజల వినతులను స్వీకరించేందుకు అధికారులు తగిన సమయం కేటాయించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. పలుకబడి ఉన్నవారికి మర్యాదపూర్వకంగా కూర్చోబెట్టి వెంటనే స్పందిస్తున్నారని, అదే సమయంలో సామాన్య రైతులు, కూలీలు, నిరక్షరాస్యులు గంటల తరబడి వేచి ఉన్నా స్పష్టమైన సమాధానం లభించడం లేదని బాధితులు వాపోతున్నారు. ప్రతి సారి "రేపు రండి" ఫైల్ ఫెండింగ్ ఉంది" అధికారి అందుబాటులో లేరు" వంటి సమాధానాలే వినిపిస్తున్నాయని చెబుతున్నారు. ప్రభుత్వం పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలనను లక్ష్యంగా ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజలకు అందుతున్న సేవలు ఆ లక్ష్యాలను భిన్నంగా ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చిన, ప్రజలు కార్యాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సిన పరిస్థితి కొనసాగుతోందని విమర్శిస్తున్నారు. ప్రజలకు సమానంగా, వివక్ష లేకుండా సేవలు అందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల పట్ల మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పెండింగ్ దరఖాస్తులను త్వరతగతిన పరిష్కరించాలని, ఫిర్యాదులపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారులు ఈ ఆరోపణలపై స్పందించి ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని కూడా వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో భారత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం రెండు పూర్తిగా విఫలమయ్యాయని తీవ్రంగా విమర్శించారు ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్ కుమార్. ఆదివారం పట్టణంలోని విశ్వశాంతి స్కూల్‌లో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) సత్తుపల్లి నియోజకవర్గ మహాసభ ఎస్‌కే పాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో భారత, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ యువతకు ఉపాధి అవకాశాలను దూరం చేస్తోందని ఆరోపించారు. ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టకుండా మతం, కులం పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు కాలేదని విమర్శించారు. యువత సమస్యలను పరిష్కరించడంలో భారత, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకే విధమైన వైఖరి అవలంబిస్తున్నాయని పేర్కొన్నారు. యువత తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ సత్తుపల్లి నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగరాజు, కార్యదర్శిగా ఎస్‌కే పాషాను ఎన్నుకున్నారు.కార్యక్రమంలో సీపీఐ టౌన్ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, సీపీఐ రూరల్ మండల కార్యదర్శి తడికమల్ల యోబు, గాదె రవి, కంచ శ్రీను, వల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పాయంని కలిసిన ఇక్బాల్ హుస్సేన్



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి ఎన్నికైన సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ని మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి మరో సారి మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి, ముఖ్యంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతంతో పాటు మండల ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వరుసగా మూడోసారి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు, అలాగే పార్టీకి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీని కరకగూడెం మండలంలో మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలతో సమన్వయంగా పనిచేయాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడలో మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన



**ప్రజాపక్షం/తల్లాడ :** రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం తల్లాడ మండలంలో విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పలు దేవాలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి, కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ తో కలిసి ఆయన ఈ పర్యటనలో పాల్గొన్నారు. గొల్లగూడెం గ్రామంలోని అభయ ఆంజనేయ స్వామి దేవస్థానాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆ గ్రామానికి చెందిన కేశవరెడ్డిని పరామర్శించారు. తెలగవరం గ్రామంలో మైసమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన పొంగులేటి సామవేదం యాగశాలను పరిశీలించారు. కేశావాపురంలో రేణుకాఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో కె. కిరణ్‌కుమార్, రాంమోహన్‌రెడ్డి, లక్ష్మి రెడ్డి, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, నర్సింహారావు, గోవింద్ శ్రీనివాస్, వీరారెడ్డి, లచ్చిరెడ్డి ఉన్నారు.

# బిఎల్‌ఏలకు గుర్తింపు కార్డులు అందజేత



**ప్రజాపక్షం/తల్లాడ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్‌ఐఆర్ ఓటరు నివేధిక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం బీఎల్‌ఓలకు ఐడీ కార్డులు అందించారు. ఓటరు నివేదికపై ఉన్న ఓటర్లకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉపసర్పంచులు, బీఎల్‌ఏలు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుర్నవల్లిలో ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ఖమ్మం :** సేవ్ యవర్ లివర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుర్నవల్లి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఖమ్మంకు చెందిన ప్రముఖ వైద్యులు సునీల్ కుమార్ జంగాల నేతృత్వంలో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని గ్రామ సర్పంచ్ శేషమ్మ ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యంపై అవగాహన కలిగించడంతో పాటు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరానికి హాజరైన వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో గ్రామ ప్రముఖులు వెంకటకోటిరెడ్డి, శివారెడ్డి, ఉప సర్పంచ్ సుహాసిని, శ్రీనివాసరెడ్డి, వెంకటాచారి, పోతురాజు వెంకటయ్య, గోపికృష్ణ, వంశీ ఉన్నారు.

# ఉచిత మెగా కంటి వైద్య శిబిరం విజయవంతం



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరం విజయవంతం అయింది. శ్రీ రాజ సాయి మందిరం విఎం బంజర ఆధ్వర్యంలో జన్నారెడ్డి విజయ జ్ఞాపకార్థం కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వారిచే విఎం బంజర గ్రామంలో జడ్పీహెచ్ పాఠశాల ఆవరణంలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 7 గంటల నుండి కంటి సమస్యతో వృద్ధులు, మహిళలు బారులు తీరారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నేత డాక్టర్ మట్ట దయానంద్ ఈ కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. పెనుబల్లి మండలం నుండే కాకుండా భద్రాచలం, మణుగూరు, ముదిగొండ, సత్తుపల్లి, వేంసురు మండలాల నుండి కంటి సమస్యలతో ఈ వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. 621 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 299 మందికి కంటి శాస్త్ర చికిత్స అవసరమైంది. మొదటి విడతగా కంటి చికిత్స అవసరమైన 60 మందిని కాకినాడ కంటి ఆసుపత్రికి తరలించారు. విడతలవారీగా మిగతా వారిని కూడా కాకినాడ తరలిస్తున్నట్లు కంటి వైద్య శిబిరం నిర్వాహకులు జన్నారెడ్డి నరసింహారెడ్డి తెలిపారు. ఈ నేత్ర శిబిరం విజయవంత చేయడంలో పెనుబల్లి ప్రభుత్వ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, రత్నాకర్ కాకినాడ కిరణ్ కంటి వైద్య సిబ్బందిల సహాయ సహకారాలు అందించారని వారందరికీ శిబిరం నిర్వాహకులు జెన్నారెడ్డి నరసింహారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఉచిత నేత్ర శిబిరాలను ఏర్పాటు చేసి ఎంతోమందికి ఉచిత కంటి చికిత్సలను నిర్వహిస్తు సేవలను కొనసాగిస్తున్న జెన్నారెడ్డి నరసింహారెడ్డి, శ్రీ రాజ సాయి మందిరం చైర్మన్ నీలాపు ఉమా రాణి లను ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి, కాంగ్రెస్ నేత డాక్టర్ మట్ట దయానంద్ అభినందనలు తెలిపారు.

# ఇల్లు, ఇంటి స్థలం కోసం రాష్ట్ర రాజధానికి దండుగా కదులుదాం..



**- అర్హులైన ప్రతికుటుంబానికి ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి**
**- చలో హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నాను జయప్రదం చేయండి**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా**

**ప్రజాపక్షం/చుంచుపల్లి:** ఇల్లు మరియు ఇంటి స్థలం కోసం నిరుపేదలంతా ఏకమై రాష్ట్ర రాజధానికి దండుగా కదలాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇంటి స్థలంతోపాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే వరకు పోరాటాలు కొనసాగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా అన్నారు. ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధన కోసం, పేదల ఇండ్ల కూల్చివేతలకు నిరసనగా అదేవిధంగా పేదలు నిర్మించుకున్న ఇండ్లకు విద్యుత్ సౌకర్యంతోపాటు ఇంటి నెంబర్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద సోమవారం నిర్వహించ తలపెట్టిన 'చలో హైదరాబాద్' ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. చుంచుపల్లి మండలం ప్రశాంత్ నగర్‌లో ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దశాబ్ధాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న నిరుపేదల గుడిసెల కూల్చివేత చర్యలను ప్రభుత్వం వెంటనే మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలు తమ సొంత శ్రమతో నిర్మించుకున్న ఇండ్లకు తక్షణమే ఇంటి నెంబర్లు కేటాయించాలని, అలాగే విద్యుత్, తాగునీరు వంటి కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. అలా కాకుండా ప్రజావ్యతిరేక విధానాలతో పేదల ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నిరుపేదల సొంతింటి కల నెరవేరే వరకు, ప్రతి గుడిసెకు పట్టా ఇచ్చే వరకు వామపక్షాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, ఈ రాజధాని ముట్టడి పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఐ టౌన్ కార్యదర్శి కంచర్ల జమలయ్య, నాయకులు రామవరం ఏరియా కార్యదర్శి గోపీకృష్ణ, సర్పంచ్ వాడె రాములు, కార్పోరేటర్ కూరపాటి సుధాకర్, నాయకులు భూక్యా శ్రీనివాస్, తూముల శ్రీనివాస్, రాజు, దార లక్ష్మి పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన ఎన్‌ఎఫ్‌ఏఈ 8వ అఖిల భారత మహాసభ

**-స్థానిక ఉపాధి, ఉద్యోగుల సంక్షేమం, భద్రతా ప్రమాణాలపై విస్తృత చర్చ**
**-నిర్వాసితులకు న్యాయం చేయాలి: ఎంఎల్‌ఏ పాయం**
**-స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పిస్తాం : ఎంపీ పోరిక బలరాం నాయక్**



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురంలో హెవీ వాటర్ ప్లాంట్ గౌతమి నగర్ కాలనీలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ ఎంప్లాయీస్(ఎన్‌ఎఫ్‌ఏఈ)ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8వ అఖిల భారత మహాసభ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. దేశంలోని వివిధ అణుశక్తి సంస్థల ఉద్యోగ ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొనడంతో సభ ప్రాధాన్యత సంతరించుకుంది. కార్యక్రమానికి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గడ్డం రమేష్ అధ్యక్షత వహించగా, హెవీ వాటర్ ప్లాంట్ చీఫ్ జనరల్ మేనేజర్ డిసి ఓజా మహాసభను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అసియాలోనే అతిపెద్ద హెవీ వాటర్ ప్లాంట్‌గా గుర్తింపు పొందిన ఈ కర్మాగారంలో ఉద్యోగుల సంఖ్య క్రమంగా తగ్గిపోవడం వల్ల స్థానిక యువత ఉపాధి అవకాశాలు కల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యంత సున్నితమైన అణుశక్తి కర్మాగారాల్లో అత్యాధునిక భద్రతా ప్రమాణాలు పాటిస్తూ, భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హెవీ వాటర్ ప్లాంట్ కోసం భూములు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభించలేదని పేర్కొన్నారు. వారి సమస్యలను ఈ జాతీయ మహాసభలో ప్రధాన అంశంగా చర్చించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. స్థానిక ఉపాధి, ఉద్యోగుల సంక్షేమం, మెరుగైన వైద్య సదుపాయాలు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ హెవీ వాటర్ ప్లాంట్‌లో స్థానిక యువతకు ఉద్యోగాల్లో తగిన ప్రాధాన్యం కల్పించేలా కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. అవసరమైతే సంబంధిత కేంద్ర మంత్రులు, ప్రధానమంత్రిని కలిసి స్థానికులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. ఉద్యోగుల ఆసుపత్రిలో వైద్య సేవల మెరుగుదల పెన్షన్ సమస్యల పరిష్కారం, రైల్వే సౌకర్యాల విస్తరణ వంటి అంశాలపై కూడా కేంద్ర స్థాయిలో ప్రత్యేకంగా ప్రస్తావిస్తానని తెలిపారు. ఈసందర్భంగా అశ్వాపురం సర్పంచ్ బానోత్ సదర్‌లాల్ మాట్లాడుతూ అశ్వాపురం రైల్వే స్టేషన్‌లో మరిన్ని రైళ్లకు నిలుపుదల కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. అనంతరం ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు, చీఫ్ జనరల్ మేనేజర్ డిసి ఓజా సంయుక్తంగా మీడియాతో మాట్లాడుతూ మహాసభలో ప్రస్తావించిన ఉద్యోగుల సంక్షేమం, స్థానిక ఉపాధి, భద్రతా ప్రమాణాలు, వైద్య సేవలు, పెన్షన్, నిర్వాసితుల సమస్యలు తదితర అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమానికి అన్ని రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో ఉద్యోగులు, ప్రతినిధులు హాజరయ్యారు.

## రామదాసు మందిరంలో విజయనగరం భక్తులు కచేరీ

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** భక్తరామదాసు ధ్యాన మందిరంలో ఆదివారం విజయనగరం కు చెందిన భక్తులు కచేరీ నిర్వహించారు. విజయనగరం శ్రీరామదాసు సంకీర్తన ప్రచార సమితి పదో వార్షికోత్సవం సందర్భంగా 30 మంది భక్తులు మందిరంలో రామదాసు కీర్తనల కచేరీ నిర్వహించారు. రామదాసును కీర్తిస్తూ నిర్వహించిన కచేరీ విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయనగర సంకీర్తన ప్రచార సమితి ప్రతినిధులు నౌడూరి కాళీప్రసాద్, వెంకటసుబ్బయ్య, జగన్నాధరాజు, స్థానిక రామదాసు ధ్యాన మందిరం పూజారి సౌమిత్రి రమేష్ పాల్గొన్నారు.

## ఆరోగ్య కరమైన నారుమడితో అధిక దిగుబడులు

**- జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వరి సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు ఆరోగ్య కరమైన నారు మడులే ప్రధానమని ఇందు కోసం రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు సూచించారు. నాణ్యమైన నారుమడి దిగుబడితో పాటు లాభాలు వస్తాయన్నారు. ఎకరాకు నాట్లు వేసేందుకు సుమారు రూ.4 సెంట్ల భూమిని నారుమడిగా సిద్ధం చేయాలని, భూమిని మెత్తగా దుక్కి చేసి సమతలంగా తయారు చేయాలని సూచించారు. దమ్ము నారుమడి పద్ధతిలో సాగుచేసే రైతులు 10 నుండి 12 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దమ్ము చేసి పొలాన్ని సిద్ధం చేయాలన్నారు. విత్తనాలను ముందుగా 24 గం.పాటు నీటిలో నానబెట్టి అనంతరం 36 గం. పాటు మూట కట్టాలని, ఇలా చేయడం వల్ల విత్తనాలు త్వరగా సమానంగా మొలకెత్తుతాయని పేర్కొన్నారు. మొలకవచ్చిన విత్తనాలను సెంటుకు 5 కిలోల చొప్పున నారుమడి సమానంగా చల్లాలని సూచించారు. నారుమడిలో పల్చగా నీరు నిల్వ ఉండేలా నిర్వహిస్తే నారుఆరోగ్యంగా పెరిగి సరైన సమయంలో నాటేందుకు అనుకూలంగా తయారవుతుందని తెలిపారు. నారు దశలో సరైన సంరక్షణ చేపడితే పంట ప్రాఅంబ నుంచే మంచి ఎదుగుదల ఉండటంతో పాటు దిగుబడి పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి నారుమడిని సిద్ధం చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు సూచనలు పాటించాలని బాబూరావు తెలిపారు. అలాగే పంట ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సాంకేతిక సలహాలను వినియోగించుకోవాలని సూచించారు.

# 15న సింగరేణి మెడికల్ బోర్డు నిర్వహణ




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి కార్మికుల వైద్య సంబంధిత పెండిగ్ కేసుల పరిష్కారానికి ఈనెల 15వ తేదిన సింగరేణి మెడికల్ బోర్డును నిర్వహించనున్నట్లు గుర్తింపు సంఘం యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. వారు ఆదివారం ప్రజాపక్షంతో మాట్లాడుతూ యూనియన్ ప్రతినిధులు పలు సందర్భాల్లో యాజమాన్యంతో పలు దశల్లో జరిపిన చర్చలు సానుకూల ఫలితాన్ని ఇవ్వడంతో మెడికల్ బోర్డు నిర్వహణకు యాజమాన్యం అంగీకరించినట్లు వారు వెల్లడించారు. సింగరేణి కాలరీస్ వర్కర్క్ యూనియన్ (ఏఐటియూసి) అనునిత్యం కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. మెడికల్ బోర్డు నిర్వహణకు ముందుకు వచ్చిన సింగరేణి సంస్థ యాజమాన్యానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

## గంజాయి పట్టివేత

**- ఒకరి అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు**



**ప్రజాపక్షం/పాల్వంచ :** గంజాయిని తరలిస్తున్న ఒకరిని పట్టుకొని 29 కిలోల గంజాయిని పాల్వంచ పట్టణ పోలీసులు ఆదివారం పట్టుకొన్నారు. పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ. టి నాగరాజు తన సిబ్బందితో కలిసి సంజయ్‌నగర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలం రోడ్ నుండి కొత్తగూడెం వైపునకు వెళుతున్న ఓ ఆటో అనుమానాస్పదంగా అతి వేగంగా వస్తున్నది. దీనితో ఆటోను ఆపి తనిఖీ చేయగా గంజాయి ఉన్నట్లు గమనించారు. వెంటనే డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ఒరిస్సా రాష్ట్రం కలిమెల నుండి మహబూబాబాద్‌కు గంజాయిని తరలిస్తున్నాడు. స్థానిక ప్రియదర్శిని కాలనీకి చెందిన ఉప్పుగుండ్ల ప్రభాకర్‌గా తెలిసింది. నిందితుడి వద్ద నుండి నగదు రూ. 34 వేయిలు, ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొన్నారు. గంజాయిని, ఆటోను స్టేషన్‌కు తరలించారు. పట్టుకొన్న గంజాయి సుమారు 28. 900 గ్రాములని దీని విలువ 14, 45,000/లు ఉంటుందని ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. నిందితుడి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని కష్టపడి చదువుకొని సమాజంలో మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఎవరైనా గంజాయి తాగినా, విక్రయించినా తగు సమాచారాన్ని నేరుగా తనకు ఇవ్వాలని కోరారు.

## ఎమిలీ పాఠశాలలో ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య అందించే లక్ష్యంతో ఎమిలీ పాఠశాలలో మొదటి తరగతి నుంచి ఏడో తరగతి వరకు ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ ములకలపల్లి గోపీనాథ్ తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు లేదా పురుషులు, ఇతర సంరక్షకుల ఆధ్వర్యంలో పెరుగుతున్న చిన్నారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అందిన దరఖాస్తులను పరిశీలించి ప్రవేశ పరీక్ష నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు విద్య పూర్తిగా ఉచితంగా అందించబడుతుందని, పుస్తకాలు, యూనిఫాం మాత్రమే తల్లిదండ్రులు సమకూర్చాల్సి ఉంటుందని చెప్పారు. దరఖాస్తుల స్వీకరణకు జూలై 10 చివరి తేదీగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రవేశ పరీక్ష తేదీని దరఖాస్తుదారులకు ఫోన్ ద్వారా తెలియజేస్తామని తెలిపారు. వివరాలకు 9912467858, 9182202087లను సంప్రదించాలని కోరారు.

## సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సహకార అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు సొసైటీ ఆధ్వర్యంలో సహకార పే సమృద్ధి సహకార వారోత్సవాల సందర్భంగా బూర్గంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదసు నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార అంశాలపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాల్గొన్న విద్యార్థులు పెన్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, సర్పంచ్ మందా నాగరాజు, డీసీసీబీ మేనేజర్ వసుమతి, డైరెక్టర్ బొల్లు రవి, సంఘ సెక్రటరీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

